ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 28 జూన్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 25.0



రెండు కుటుంబాల్లో చీకట్లు

కరెంట్ షాక్‌తో
తాడేపల్లిగూడెంలో భార్యభర్తలు..
ఈదరలో తల్లీకొడుకు మృతి -7లో..




మావుళ్లమ్మకు విశాఖ మహిళల సారె

భీమవరం టౌన్, జూన్ 27 : మావుళ్లమ్మ జ్యేష్ఠ మాస జాతర సందర్భంగా విశాఖపట్టణానికి చెందిన హేమ లత, భక్త బృందం సభ్యులు గురువారం అమ్మవారికి సారె సమర్పించారు. గాజులు, పసుపుతో అలంకరించిన పాదాలు, వివిధ రకాల పండ్లు, స్వీట్స్, గాజులు, పసుపు కొమ్ములు, యాలకులు, నెమలి ఈకలతో తయారు చేసిన దండలను అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జునశర్మ పూజలు నిర్వహించి, వారు తెచ్చిన దండలను అమ్మవారికి అలంకరించారు. అనంతరం మహిళలు లలిత సహస్ర నామ పారాయణం, కోలాటం నిర్వహించారు. ఈవో బుద్ద మహాలక్ష్మి నగేష్ దేవస్థానం తరుపున శేష వస్త్రాలను అందించారు.



అన్నదాత సుఖీభవ..



పేరుకే పథకం. ఎప్పుడు ఖాతాలో సొమ్ము పడుతుందో తెలియదు. ఏ తేదీన వేస్తారో.. వేయరో కూడా సొమ్ము పడేంత వరకు అనుమానమే. పేరుకు మాత్రం రైతు ప్రభుత్వం. పైపైకి మాత్రం రైతన్నలు అంటే తనకెంతో ఇష్టం. ఈ ఐదేళ్లు ఇలా కృత్రిమంగా గడిపేశారు. రైతు భరోసా పేరిట రైతుకు సకాలంలో చెందాల్సిన సొమ్మును అందకుండా చేశారు. ఆఖరికి ఎన్నికలకు ముందు కొందరు రైతులకు ఏదో ముట్టచెప్పారు. మరికొందరికీ మొండిచేయి చూపారు. విసుకు చెందిన రైతులు కూటమి వైపు మొగ్గారు. ఇప్పుడు ఆ కూటమి రైతుపక్షాన ఏడాదికి రూ.20 వేలు చొప్పున వారి ఖాతాల్లో వేస్తూ... అన్నదాత సుఖీభవ అంటూ దీవించింది.

- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

పట్టెడు అన్నంపెట్టే రైతుకు కూటమి దీవెన

- పథకం పేరు మారింది.. జాబితాలో మార్పులు ఉంటాయా?
- సకాలంలోనే సొమ్ములు ఇస్తేనే లాభం
- కౌలు రైతుల సంగతి తేల్చబోతున్నారా?
- రైతుల్లో అప్పుడే కోటి ఆశలు

అప్పుడేమో రైతుకు దక్కని భరోసా

గడిచిన ఐదేళ్లలో జగన్ సర్కార్ అన్ని వర్గాలను నమ్మించి మోసం చేసినట్టే రైతులను వదల్లేదు. సాధారణంగా తొలకరి ఆరంభమైన వెంటనే వ్యవసాయ పనులు ముమ్మరవుతాయి. ఆ లోపే అటు సహకార సంఘాల నుంచి రుణం కాని, ప్రభుత్వం విధాన నిర్ణయమైన ప్రత్యేక పథకం ద్వారా గాని రైతుకు సొమ్ము చేతిలో పడాలి. కాని జగన్ సర్కార్ పట్టించుకోలేదు. వ్యవసాయ ఆధారిత జిల్లా అయిన ఉమ్మడి పశ్చిమలో సాగు చేసే రైతుల సంఖ్య మిగతా జిల్లాల కంటే అత్యధికమే. గడిచిన ప్రభుత్వంలో రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా ప్రకటించారు. ఏటా రూ.13 వేలు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం ఇచ్చే మరో రూ.6 వేలు మొత్తం మీద కలిపి రూ.19 వేలు రైతులకు అందిస్తామంటూ ఊదరగొట్టారు. రైతు ఖాతాలను తెరిపించారు. వ్యవసాయ సీజన్ ఆరంభం కాక మునుపే మే, జూన్ నెలల్లో గతంలో కేంద్రం ఇచ్చే మొత్తం రూ.6 వేలను మూడింటిగా విభజించి సీజనల్ వారీగా రూ.2 వేలు చొప్పున రైతు ఖాతాలో పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.13 వేలు ప్రకటించగా, దీనిని రెండుగా విభజించి ఒకసారి రూ.5,500, రెండో దఫా రూ.2 వేలుగా రైతు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కాని చానాళ్ళు ఖరీఫ్ ఆరంభానికి ముందే బటన్ నొక్కినా సొమ్ము రైతు ఖాతాల్లో జమే కాలేదు. ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తాం అంటూ నాన్చి వేసేవారు. పైకి మాత్రం అందరి ఖాతాల్లోనూ సొమ్ములు జమ చేసినట్లు గొప్పలు చెప్పేవారు. కేంద్రం ఇచ్చే వాటాను తానే ఇస్తున్నట్లు గొప్పలకు పోయారు. దీనికి సమాంతరంగా సహకార సంఘాలను భ్రష్టు పట్టించారు. రైతు భరోసా కింద యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు, ఎరువులు ఇస్తామని చెప్పి నానా హంగామా చేశారు. ఇది కూడా కొంత మందికే పరిమితమైంది. గడిచిన ఐదేళ్ళలోనూ గోదావరి రైతు ఎక్కడా సంతృప్తి చెందిన దాఖలాలే లేవు.

ఇప్పుడేమో అన్నదాత సుఖీభవ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల్లో కొత్త ఆశలు అలుముకున్నాయి. తాము అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే ఏటా రైతు ఖాతాలో రూ.20 వేలు జమ చేస్తామని, ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు ఇచ్చారు. ఇప్పుడు ఆ మాటను అక్షరాల నిలబెట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం సంసిద్ధమైంది. రైతు ఖాతాలో గడిచిన ప్రభుత్వం ఖరీఫ్‌కు కొంత సొమ్ము జమ చేసినా కొంత మాత్రమే రైతుకు చేరింది. మిగతా సొమ్ము అంతా గప్‌చిప్. కూటమి ప్రభుత్వం తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏటా రూ.20 వేలు చెల్లించాలి. దీనిలో కేంద్రం వాటా రూ.6వేలు కాగా, రాష్ట్రవాటా రూ.14 వేలు, ఈ ప్రాతిపదికపై రైతుల ఖాతాల్లో సొమ్ములు చెల్లించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సి ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రైతుభరోసా కింద అప్పట్లో రెండున్నర లక్షల మందికి పైగానే సొమ్ములు అందుకోగా, ఒక్క ఏలూరు జిల్లాలోనే లక్షా 50 వేల మందికి పైగా రైతులు ఉన్నారు. దీనికి తోడు కౌలు రైతులు ఉమ్మడి జిల్లాలో 3 లక్షలు ఉండగా, ఏలూరు జిల్లాలో లక్షా 30 వేల మందికి పైగానే ఉన్నారు. ఇంతకు ముందు మాదిరి కేంద్రం వాటాను మూడు వాటాలుగా విభజిస్తారా ? రాష్ట్ర వాటాను రెండు విడతలా ? లేదా ? మూడు విడతలు చేస్తారా ? అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు రైతుకు అవసరమైన సొమ్మును సకాలంలో అందించే ప్రయత్నం చేస్తారా ? అనేది ఇప్పుడు తేలాల్సి ఉంది. తొలకరి ప్రారంభమై చానాళ్ళు అయింది. చాలామంది రైతుల చేతుల్లో చిల్లిగవ్వలేదు. ఒకవైపు చూస్తే సొసైటీలు పడకేశాయి. ఇంకోవైపు అధికవడ్డీ ఇచ్చే వారంతా కాపు కాసుకొని కూర్చొన్నారు. వీటన్నింటి నడుమ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్‌లోనే ఏం చేయబోతుందనేదే ప్రధాన ప్రశ్న. మరోవైపు కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే పథకాలు వర్తించవు. ఇదొక ప్రధాన సమస్య. ఈసారి అన్నదాత సుఖీభవలో రైతులకు సంతృప్తిని ఇచ్చే అనేక అంశాలు ఉన్నాయి. అందుకనే వైసీపీతో విభేదించి అంతా కూటమి పక్షాన చేరారు. కొత్త ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు.

కౌలు రైతులను ఏం చేయబోతున్నారు .?

గడిచిన తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు ప్రత్యేక కార్డులను ప్రభుత్వం ప్రకటించింది. అప్పట్లో కౌలురైతులకు కార్డులు అందించడంలో ఉమ్మడి పశ్చిమ రాష్ట్రంలోనే తొలి వరుసలో నిలిచింది. అప్పటి కలెక్టర్ వాణీ మోహన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వ్యవసాయంలో తగిన పరపతి అందేలా చేసేందుకు కౌలు కార్డులను నియోజక వర్గాల వారీగా లక్ష్యాలుగా తీసుకుని మంజూరు చేశారు. కాని రానురాను గడిచిన ఐదేళ్ళల్లో కౌలు రైతు పరిస్థితి మళ్ళీ అడ్డం తిరిగింది. నిత్యం చెమటోడ్చి వ్యవసాయమే లక్ష్యంగా పని చేస్తున్న కౌలు రైతులకు పరపతి లేదు, అంతకంటే మించి అధిక వడ్డీలకు ఇచ్చేవారంతా పీక్కు తినడంలోనే తొలి వరుసలో ఉన్నారు. ఈ పరిస్థితిని తట్టుకోలేక కౌలు రైతు కుటుంబాల్లో అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇవేమి అప్పటి జగన్ ప్రభుత్వానికి పట్టనే లేదు. కాని కూటమి మాత్రం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలురైతుకు అండగా ఉంటామని ప్రకటించారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకంలో కౌలు రైతులను చేరుస్తారా? లేదా? అనేదే ఇప్పుడు అందరి ఎదుట ఉన్న ప్రశ్న. ఈ అంశాలన్నింటిని రాష్ట్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని, త్వరలోనే ఖచ్చితమైన మార్గదర్శకాలు వెలువడతాయని చూఛాయగా అధికారులు చెబుతున్నారు.

ధాన్యం బకాయిల కోసం రోడ్డెక్కిన రైతులు



ఉంగుటూరు, జూన్ 27 : ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కైకరం పంచాయతీ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేశారు. ధాన్యం బకాయిలు చెల్లించండి మహాప్రభో అంటూ రోడ్డెక్కి హోరున వర్షంలో అన్నదాతలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు మాట్లాడుతూ జిల్లాలోని రైతులు, కౌలు రైతులకు రూ.240 కోట్ల వరకు ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. పాత అప్పులు తీరక ఖరీఫ్ సాగుకు కొత్త అప్పు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చినా రైతుల బకా యిల విషయంలో తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ధర్నాలో రైతులు దుడే కేశవ, ఇందుకూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.



చెక్కపల్లిలో వాగులో కట్టిన అక్రమ నిర్మాణం

వాగును పూడ్చేద్దాం..

- అక్రమంగా కట్టేద్దాం.. అధికారులకు రైతుల ఫిర్యాదు

ముసునూరు, జూన్ 27: చెక్కపల్లి పెద్ద చెరువులోకి నీరు వచ్చే బసవరపు పాడు వాగు ఆక్రమణకు గురైంది. ఏడాది నుంచి వైసీపీ నాయకుల అండదండలతో వాగును పూడ్చి నిర్మాణాలు చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. వైసీపీ నాయకులు దాసరి సల్మాన్ రాజు, మారుమూడి సంజీవ రావు వాగును పూడ్చి రేకుల షెడ్ వేయగా, తొమ్మండ్రు బాబురావు వాగులో పిల్లర్లు వేసి రేకుల షెడ్‌ను నిర్మించి కూరగాయల దుకాణం పెట్టాడు. దీని పక్కనే మరో వ్యక్తి మరో అక్రమ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నాడు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని నీటిపారుదల వాగులో కట్టిన అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఇరిగేషన్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా, స్పందనలో అర్జీలు పెట్టినా ఎవరూ పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెక్కపల్లిలోని పెద్ద చెరువులోకి ఎన్ఎస్‌పి కాల్వ నుంచి, బసవర్పాడు వెంకాయకుంట కొలింగి నుంచి ఈ కాల్వ ద్వారా నీరు రావాలి. కాని, వాగును ఇష్టానుసారంగా పూడ్చి అక్రమ కట్టడాలు కట్టడం వల్ల కాల్వ వెడల్పు తగ్గి, చెరువులోకి నీరు చేరే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ షేక్ సలీమ్ మాట్లాడుతూ 'అక్రమ నిర్మాణాలపై రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాగును సర్వే చేసి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చాం. అయినా వాటిని తొలగించలేదు. రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి త్వరలో వాటిని పూర్తిగా తొలగిస్తాం' అని చెప్పారు.

జిల్లా సైన్స్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 27 : జిల్లా సైన్స్ ఆఫీసర్ పోస్టు భర్తీకి స్కూల్ అసిస్టెంట్ కేడర్ సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం పదేళ్ల అనుభవం, అర్హతలు గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తును తమ స్కూలు హెచ్‌ఎం కౌంటర్ సంతకంతో కూడిన రెజ్యూమ్, ఇతర ధ్రువపత్రాలను, అనుభవాన్ని తెలిపే పత్రాలను జతచేసి ఏలూరులోని సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయంలో జూలై 7వతేదీ సాయంత్రం 5గంటల్లోగా అందజేయాలని సూచించారు. వివరాలకు ఎస్ఎస్‌ఏ ఏఎంవోను 92486 69171లో సంప్రదించాలని కోరారు. కాగా జిల్లా సైన్స్ ఆఫీసర్ పోస్టుకోసం ప్రయత్నిస్తున్న వారిలో సమగ్రశిక్ష జిల్లా కార్యాలయంలో ఇన్‌చార్జి హోదాలో పనిచేస్తున్న ఓ సెక్టోరల్ ఆఫీసర్ ఇప్పటికే తొలివరుసలో ఉండగా, జంగారెడ్డిగూడెంకు చెందిన మరో ఉపాధ్యాయుడు తనవంతు యత్నాలు చేస్తున్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఇంటికే పింఛన్లు

- ఎరియర్స్‌తో కలిపి రూ.7 వేలు అందజేత
- 2.68 లక్షల మందికి రూ.183 కోట్లు పంపిణీ
- కలెక్టర్ వెట్రిసెల్వి..అధికారులతో సమీక్ష

ఏలూరు సిటీ/ఏలూరు కలెక్టరేట్, జూన్ 27 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 1వ తేదీ నుంచి పెంచిన పెన్షన్ పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. జిల్లాలో వివిధ రకాల పింఛన్‌లు పొందుతున్న 2 లక్షల 68 వేల 904 మందికి జూలై 1వ తేదీన రూ. 183 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి గురువారం జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో పెన్షన్ల పంపిణీకి సంబంధించిన అంశాలపై అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. జూలై 1వ తేదీన పెన్షన్ దారుల ఇంటింటికీ వెళ్ళి సచివాలయ ఉద్యోగులు పెన్షన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెంచిన పెన్షన్లు అమల్లోకి వస్తాయని తద్వారా జూలై 1న ఒక్కొక్క పెన్షన్ దారుడు రూ. 7వేలు పొందుతున్నారన్నారు. ఆ తర్వాత నెల నుంచి నెలకు రూ.4వేలు అందుకుంటారన్నారు. ఒక్కొక్క సచివాలయ ఉద్యోగికి 50 ఇళ్లకు కేటాయించామని, ఆశా వర్కర్లను పంపిణీకి విని యోగించరాదని స్పష్టం చేశారు.

- జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు తెలిపారు. ఏపీ సచివాలయం నుంచి గురువారం పెన్షన్ పంపిణీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జడ్పీ సీఈవో సుబ్బారావు, ఏలూరు కమిషనర్ వెంకటకృష్ణ, ఎల్‌డీఎం నీలాద్రి పాల్గొన్నారు.
- జిల్లాలో డయేరియా వ్యాప్తిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలోని ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులతో డయే రియా వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జూలై 1నుంచి ఆగస్ట్ నెలాఖరు వరకు డయేరియా నిర్మూలన పై అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు.

ముసురేసింది..

- జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు
- పెదవేగిలో 54.4 మి.మీ వర్షపాతం నమోదు
- ముమ్మరంగా సార్వా పనులు
- అధ్వానంగా మారిన రహదారులు

ఏలూరు సిటీ/నూజివీడు టౌన్/ కామవరపుకోట/కొయ్యలగూడెం/పెదవేగి, జూన్ 27 : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం కారణంగా జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల రాకతో సార్వా పనులు జోరందుకున్నాయి. ఎడతెరపి లేని వర్షాలకు రహదారులు మరింత అధ్వానంగా తయారయ్యాయి. సార్వా సాగులో భాగంగా వరి నారుమళ్లు, వరి నాట్లు పనులు ముమ్మరమయ్యాయి. మెట్ట ప్రాంతమైన నూజివీడు నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. గురువారం ఓ మోస్తారు నుంచి వర్షం కురవడంతో వరిసాగుకు రైతులు నారుమళ్ళను సిద్ధం చేసి విత్తనాలు జల్లేందుకు ఉపక్రమిస్తున్నారు. నూజివీడు నియోజకవర్గంలో దాదాపు 1,10,000 ఎకరాల్లో వ్యవసాయ భూమి విస్తరించి ఉంది. జిల్లాలో గడచిన 24 గంటలలో అత్యధికంగా పెదవేగి మండలంలో 54.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 17.2 మి.మీగా నమోదైంది. కలిదిండిలో 46.4, మండవల్లిలో 39.8, చింతలపూడిలో 36.4, ముదినేపల్లిలో 34.2, నిడమర్రులో 30, భీమడోలులో 27.2, కైకలూరులో 23.6, పెదపాడులో 20.8, లింగపాలెంలో 17.8, నూజివీడులో 16.2, దెదులూరులో 14.2, ఉంగుటూరులో 13, ఆగిరిపల్లిలో 12.8, ఏలూరు రూరల్‌లో 12.2, టి.నరసాపురంలో 11.4, ఏలూరు అర్బన్‌లో 11.4, కామవరపుకోటలో 9.8, పోలవరంలో 8, చాట్రాయిలో 8.2, ముసునూరులో 6.8, ద్వారకా తిరుమలలో 6.2, వేలేరుపాడులో 5, కొయ్యలగూడెంలో 4.2, కుక్కునూరులో 3.2, జంగారెడ్డి గూడెంలో 2.8, జీలుగుమిల్లిలో 2.4, బుట్టాయి గూడెంలో 2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. వర్షాల రాకతో ఎండ తీవ్రత నుంచి జిల్లా ప్రజలు ఉపశమనం పొందారు. మరో మూడు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. కామవరపుకోట మండలంలోని పలు గ్రామాల్లో బుధ, గురు వారాలు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురియడంతో అంతంత మాత్రంగా ఉన్న గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. కాలనీల్లో రోడ్డు ఎక్కడో, గొయ్యి ఎక్కడో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. కొయ్యల గూడెం మండలంలో వర్షాలకు రోడ్లన్నీ బురద మయం అయ్యాయి. మురుగు డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. కొయ్యలగూడెం కాళింగపేటలో సీసీరోడ్డు పైనే డ్రెయిన్ మూడు రోజులుగా ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. పెదవేగి మూడు రోజులుగా పడుతున్న వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుతో పాటు ఉద్యానపంటలకు ఈ వర్షం మేలు చేస్తుంది. గోపన్నపాలెం- బాద రా ల రోడ్డులో దిబ్బగూడెం దగ్గర రహ దారిపై నీరు నిలిచి కుంటను తలపి స్తోంది. రహదారిపై భారీగా చేరిన నీటితో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.



కొయ్యలగూడెం కాళింగపేటలో సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు





పెదవేగిలో జోరున కురుస్తున్న వర్షం.. అధ్వానంగా మారిన రోడ్డు

వనామి రొయ్యకు వర్షం దెబ్బ

కలిదిండి : వాతావరణంలో మార్పులతో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో చెరువుల్లో ఆక్సిజన్ లోపించి వనామి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. కలిదిండి మండలంలో 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. దుంపలకోడుదిబ్బ, కొండూ రు, మట్టగుంట, కొండంగి, గొల్లగూడెం గ్రామాల్లో చెరువుల్లో రొయ్యలు చనిపోతుండటంతో కౌంటుకు రాకుండానే హడవిడిగా పట్టుబడి చేస్తున్నారు. చిన్న సైజు రొయ్యలను పట్టుబడి చేయటంతో వ్యాపారస్థులు వీటిని కొనుగోలు చేయటం లేదు. దీంతో ఆకివీడు మార్కెట్‌లో అయిన కాడికి అమ్ముకోవటంతో గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరానికి లక్ష రూపాయల పెట్టుబడి పెట్టారు. కనీసం ఖర్చులు రాక అప్పుల పాలవుతున్నా మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు చెరువుల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్ తగు మోతాదులో పిచికారీ చేయాలని మత్స్యశాఖ ఏడీ చాంద్ బాషా తెలిపారు.



సంసిద్ధంగా ఉండండి..

- డీఆర్వో పుష్పమణి

ఏలూరు సిటీ : జిల్లాలో వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి అవసరమైన సంసిద్ధతపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి పుష్పమణి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశం మందిరంలో గురువారం ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సంసిద్ధతపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ, ఆర్డీవోలు ఎస్ఎస్‌కె ఖాజావలి, కె.అద్దయ్య, వై.భవానీ శంకరి, వివిధ శాఖల అధికారులతో డీఆర్వో సమీక్షించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో వరదలు, తుఫానులు వంటి సమయాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సంబంధిత శాఖల అధికారులందరూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి సమర్పించా లన్నారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, ఆర్‌డబ్ల్యూ్ ఎస్, ఆర్అండ్‌బీ ఎస్ఈలు సత్యనారాయణ, జాన్ మోషే, పశుసంవర్ధకశాఖ జేడీ నెహ్రూబాబు, వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్



సి.పురుషోత్తమ కుమార్

ఏలూరు క్రైం, జూన్ 27 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో, కొవ్వూరులో ఉన్న కోర్టులలో ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ప్రాంసరీ నోటు దావాలు, ఆస్తిదావాలు, తనఖా, మోటారు వాహన ప్రమాద కేసులు, కార్మిక వివాదాలు, చిట్‌ఫండ్ సంబంధిత, ఆర్బిటేషన్ కింద రికవరీ కేసులు పరిష్కరిస్తామన్నారు. సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులు ఎన్‌హెచ్ఏఐ భూసేకరణ వ్యవహారాలు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, దాంపత్య హక్కుల పునరుద్ధరణ, నిర్వహణ, సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలోని ఏలూరులో 9 బెంచ్‌లు, మరో 26 బెంచ్‌లు జిల్లాలో ఉన్న అన్ని మండల న్యాయసేవాధికార సంస్థలో ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, భీమవరం, నరసాపురంలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీలలో వీడియోకాన్ఫరెన్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. దూర ప్రదేశాలు ఉన్న కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు వారు ఉన్న ప్రదేశం నుంచే వీడియో కాన్ఫరెన్సుతో కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించదగిన వాటిని ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే ఏలూరులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఫోన్ నంబరు 08812-22455ను గాని వాట్సాప్ నంబరు 94409 01064లో సంప్రదించాలని సూచించారు.

ఏపీ పీజీ సెట్‌లో
పశ్చిమ, ఏలూరు జిల్లా టాపర్స్

విశాఖపట్నం, జూన్ 27(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రన్ టెస్ట (ఏపీ పీజీసెట్-2024) ఫలితాలను ఆంధ్ర విశ్వ విద్యాలయం అధికారులు గురువారం విడుదల చేశారు. మొత్తం 34 సబ్జెక్టుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 10 నుంచి 13 తేదీల మధ్య 24 కేంద్రాల్లో ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని టాప్ ర్యాంకులు సాధించిన పలువురి విద్యార్థుల వివరాలు.. బోటనీలో దెందులూరు మండలం కొమిరేపల్లికి చెందిన గుర్రం శృతి ఎనిమిదో ర్యాంకు, ఎడ్యుకేషన్‌లో పోడూరుకు చెందిన తస్నీడి దేవిక తొమ్మిదో ర్యాంకు, హిందీలో కొత్త పట్టిసీమకు చెందిన కోనాల వెంకన్నబాబు రెండో ర్యాంకు, లైఫ్ సైన్స్‌లో నరసాపురానికి చెందిన హన్నే కోరం, ఫిజికల్ సైన్స్‌లో పెనుగొండకు చెందిన అత్యం శ్రావణి 12వ ర్యాంకు, గుండుగొలనుకు చెందిన పాతూరి ప్రసన్న 12వ ర్యాంకు, జువాలజీలో భీమవరానికి చెందిన నిమ్మగడ్డ రత్నశ్రీ, తెలుగులో చింతపర్రుకు చెందిన వివిఎస్ఎస్‌కెఎన్ మల్లయ్య, గణపవరం మండలం ఎస్.కొండేపాడుకు చెందిన బి.సత్యవాణి నాలుగో ర్యాంకు, స్టాటిస్టిక్స్‌లో పి.మోహిత నాలుగో ర్యాంకు, భీమవరానికి చెందిన నక్కా నవ్యసుధ ఐదో ర్యాంకు, మండపాకకు చెందిన పైబోయిన శ్రావణి సుబ్రహ్మణ్యేశ్వరి 13వ ర్యాంకు సాధించారు.



పోలీసులకు నగదు రివార్డును అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ప్రతిభ కనబర్చిన పోలీసులకు నగదు రివార్డులు

ఏలూరు క్రైం, జూన్ 27 : ఏలూరు జిల్లా ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసు దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించి నగదు రివార్డులను అందించారు. గురువారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో కైకలూరు రూరల్ సీఐ పి.కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకటకుమార్, హెడ్‌కానిస్టేబుల్ టి.శంకరరావు, కానిస్టేబుల్ నాగబాబులను ఆమె అభినందించి, నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

నాలుగు ఉద్యాన కేవీకేలకు పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాల నాలుగు ఉత్తమ పురస్కారాలను శాస్త్రవేత్తలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ సాంకేతిక పరిశోధన అనే ప్రయోగ సంస్థ, ఉద్యాన విశ్వవిద్యాలయం, కేంద్ర వాణిజ్య పంటల పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన యాన్యువల్ జోనల్ వర్క్‌షాప్‌లో ఈ అవార్డులు అందుకున్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరిలోని 72 కేవీకేల పనితీరును బట్టి ఈ అవార్డులు అందించారు. అవార్డుల్లో వెంకట్రామన్నగూడెం కేవీకేకు ఉత్తమ ఆర్య పథకం అమలు, ఉత్తమ చేపలు-రొయ్యల సాగు శిక్షణలు, ఉత్తమ ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటులో అవార్డులు అందుకోగా, తూర్పుగోదావరి జిల్లా కేవీకే పందిరిమామిడికి రబ్బరు సాగులో ఉత్తమ కార్యక్రమాలు, అత్యధిక నైపుణ్య శిక్షణ అమలులో అవార్డులు అందుకున్నారు.

రేపు నరసాపురంలో జాబ్ మేళా

భీమవరం అర్బన్, జూన్ 27: నరసాపురంలోని వైఎన్ కాలేజీలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కనకారావు, జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. ఈ జాబ్‌మేళా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో పేటీఎం, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఎపాక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ చేసిన యువతీయువకులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు 93935 75353 నంబరులో సంప్రదించాలన్నారు.

జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు వాయిదా

ఏలూరుసిటీ, జూన్ 27: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 27న జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు గురువారం తెలిపారు.


డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు
పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ నియామకం

ఏలూరుసిటీ, జూన్ 27: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌ని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీఎంఎస్ పర్సన్ ఇంచార్జిగా ఏలూరు జేసీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు హుండీల ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి, జూన్ 27 : మండలంలోని సింగరాయ పాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం హుండీల లెక్కింపు జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి నేల సంధ్య తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు భక్తుల నుంచి వచ్చిన కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ స్కూళ్ల దందా..



యూనిఫాం.. ఐడీ కార్డు.. బుక్స్ అమ్మకాల్లో దోపిడీ

- రూ.20వేల నుంచి రూ.30 వేలు వీటి కొనుగోలుకే
- యూనిఫాం, టై, బుక్స్ అక్కడే కొనాలి
- ట్రేడ్ లైసెన్స్ ఉండదు.. జీఎస్టీ చెల్లించరు..
- బెంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- విద్యాశాఖ దృష్టి సారించాలని వినతి

రోజువారీ వేతనంపై జీవించే పారులు సైతం తమ పిల్లలను మంచి స్కూళ్లలో చదివించాలనే ఆశయాన్ని కొన్ని ప్రైవేట్ స్కూళ్లు క్యాష్ చేసుకుంటున్నాయి. స్కూల్ ఫీజులే కాకుండా విద్యార్థులకు అవసరమైన సమస్త సామగ్రి ఆయా కార్పొరేట్ స్కూళ్లలోనే కొనుగోలు చేయాలి. ఐడీ కార్డు, టై, బెల్ట్, సాక్స్, షూ, యూనిఫాం, పుస్తకాలు అన్ని అక్కడే కొనాలి. అత్యధిక శాతం కార్పొరేట్ స్కూళ్లలో వీటి ధరలు 50 నుంచి 60 శాతం అదనంగా ఉంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ స్కూళ్ల నిలువు దోపిడీని నియంత్రించాలని తదనుగుణంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతూ ఓ ప్రత్యేక కథనం.

- పాలకొల్లు

ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాలే ఉంటాయి. కార్పొరేట్ స్కూళ్లలో తాము సొంతంగా తయారు చేసుకున్న 'కరికులం' (సిలబస్) తయారు చేసి అమ్మకాలు జరుపుకుంటున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో విద్యతో పాటు విద్యా సామగ్రి అమ్మకాలు జరిపితే ట్రేడ్ లైసెన్సు కలిగి ఉండాలి. జీఎస్టీ చెల్లించాలి. అధికశాతం స్కూళ్లలో ట్రేడ్ లైసెన్సు లేకుండా, జీఎస్టీ చెల్లించకుండానే విద్యాసామగ్రి అమ్మకాలు జరిపి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆయా కార్పొరేట్ స్కూళ్లు తయారు చేసుకున్న సొంత సిలబస్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలపై ఆయా స్కూళ్ళ పేర్లు ముద్రించుకుంటున్నారు. ఆవిధంగా పేరు ముద్రిస్తే జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. వీటన్నిటినీ బేఖాతర్ చేస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న కొన్ని కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు దోచేస్తున్నాయి.

ఎల్‌కేజీ నుంచే బాదుడు..

ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యనందించే కార్పొరేట్ స్కూళ్ళలో పలుపేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారు. యూనిఫాం, ఐడీ కార్డు, పుస్తకాలకే రూ.20 వేల నుంచి రూ. 30 వేల వరకు అవుతుంది. తొలుత అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ట్రాన్స్‌పోర్టు ఫీజు, లైబ్రరీ ఫీజు, క్రీడా సామగ్రి ఫీజు, ఈవిధంగా పలు రూపాలలో ఎల్‌కేజీ స్థాయి నుంచే లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. పలు కార్పొరేట్ స్కూళ్లలో క్రీడా మైదానాలు కనిపించవు. పీఈటీలు ఉండరు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని అత్యధిక కార్పొరేట్ స్కూళ్లలో ఇదే తీరు కొనసాగుతోంది. కనీసం వంద మంది విద్యార్థులకు ఒక ఫిజికల్ డైరెక్టర్ ఉండాలి, డ్రిల్ మాస్టర్‌గా పిలువబడే పీడీలను కొన్ని స్కూళ్ళలో కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించుకుంటున్నారు. ఒక ఫిజికల్ డైరెక్టర్ 5, 6 స్కూళ్ళలో డ్రిల్ క్లాసులకు హాజరైనట్టు నమోదు చేసుకుంటూ హాజరు పట్టికలు చూపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఫిజికల్ డైరెక్టర్‌ను పూర్తిస్థాయిలో నియమిస్తే రూ. 25 వేల నుంచి 30 వేలు జీతం ఇవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశంతో రూ.4 లేక 5 వేలు మాత్రమే ఇచ్చి అటెండెన్స్ రిజిస్ట్రర్లలో డ్రిల్ క్లాసు నిర్వహిస్తున్నట్టు చూపించుకుంటున్నారు.

జీఎస్టీని ఎగ్గొడుతున్న వైనం..

తమ పిల్లలను పెద్ద చదువులు చదివించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు కార్పొరేట్ స్కూళ్ళవైపు ఆకర్షితులవుతుంటే అదే అదనుగా కొన్ని స్కూళ్ళ యాజమాన్యాలు దోపిడీకి తెర తీస్తున్నాయి. ఒకవైపు ఫీజులతో పాటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ వంటి వాటిని నొక్కేస్తున్నారు. సామాన్యశాస్త్రం, చరిత్ర వంటి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం తగ్గించి ఐఐటీ ఫౌండేషన్ పేరుతో ప్రత్యేక సిలబ స్ ఇవ్వడం వల్ల చరిత్ర, భౌగోళిక శాస్త్రంకు సంబంధించిన విషయాలపై విద్యార్థులకు అవగాహన ఉండడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి లోకేశ్‌ను కలసిన ఉపాధ్యాయులకు హామీ



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న డీపీఆర్‌టీయూ నేత వెంకటేశ్వరరావు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 27 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్య. దిక ప్రాధాన్యం ఇస్తుందని మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి లోకేశ్‌ను డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర రావు కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీచర్లకు బోధనేతరపనులను తగ్గించి, బోధనకే పరిమితం చేయాలని కోరామన్నారు. జీవో 117 ఉత్తర్వులను రద్దుచేయాలని, ప్రాథమిక పాఠశాలలను 1-5వ తరగతి వరకు నిర్వహించాలని అభ్యర్థించామన్నారు. ఈ ఏడాది పాఠశాలల నిర్వహణకు మెయింటెనెన్స్ గ్రాంట్లను తక్షణం విడుదల చేయాలని కోరామన్నారు. మంత్రిని కలిసిన డీపీఆర్టీయూ నాయకులు డి.శ్రీను, ప్రభాకర్, జ్ఞానేశ్వర్, తదితరులున్నారు.

ఉమ్మడి జిల్లాకు 8 నాన్ ఏసీ స్లీపర్ బస్సులు రాక



స్టార్ లయినర్ ఆర్టీసీ బస్సు

భీమవరంటౌన్, జూన్ 27 : ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన నాన్ ఏసీ సర్వీసులు నడిపేందుకు ఉమ్మడి పశ్చిమ జిల్లాకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఎనిమిది బస్సులను కేయించారు. స్టార్ లయినర్ పేరిట ఉండే ఈ బస్సులు నాన్ ఏసీ స్లీపర్ బస్సులుగా అధికారులు పేర్కొంటున్నారు. వీటిలో ఏలూరు జిల్లా ఏలూరు డిపోకు 2, జంగారెడ్డిగూడెం డిపోకు 2, పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు-2, నరసాపురం-2 బస్సులు రానున్నాయి. మొదటి విడతగా ఏలూరు, తణుకు డిపోలకు బస్సులు వస్తాయని తెలిపారు. ఇప్పటివరకు సీటులతో కూడిన సర్వీసులను మాత్రమే ఆర్టీసీ నడుపుతోంది. గతంలో స్లీపర్ బస్సు భీమవరం డిపో నుంచి నడిపినా అంతగా ప్రయాణికుల నుంచి స్పందన రాకపోవడంతో సర్వీసును రద్దు చేశారు. ఇప్పుడు సరికొత్తగా కొత్త బస్సులతో ఈ సర్వీసులను నడపనున్నారు. ప్రయాణికుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

వైభవంగా మావుళ్లమ్మ జ్యేష్టమాస జాతర

- ఉత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు
- ఆకట్టుకున్న కళాకారుల వేషధారణలు



అలంకరించిన వాహనం..ఉత్సవమూర్తికి హారతిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు



డప్పుకళాకారుల విన్యాసాలు

భీమవరంటౌన్, జూన్ 27 : నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అమ్మవారి జ్యేష్ఠమాస జాతరను వైభవంగా నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, బుట్టబొమ్మలు, డప్పు కళాకారులు, వేంకటేశ్వరస్వామి వేషధారణ, ఫుల్ బ్యాండ్ ట్రూపుతో ఉత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. అనంతరం గ్రామోత్సవానికి ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకరించి ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. కొబ్బరికాయ కొట్టి ఉత్సవాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దేవస్థానం తరఫున రెండు లక్షల రూపాయలను ఉత్సవాల నిమిత్తం నిర్వాహకులకు ఆయన అందజేశారు. ఆయనతో పాటు జనసేన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు పూజలు చేశారు. కార్యక్రమంలో కోళ్ళ నాగేశ్వరరావు, రామాయణం గోవిందరావు, తూటరావు ఏడుకొండలు, కొప్పుల రంగారావు, రామాయణం సత్యనారాయణ, రామాయణం సత్యనారాయణ, మానేపల్లి భాస్కరరావు, రామాయణం శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, వబిలిశెట్టి రామకృష్ణ, కాగిత వెంకటరమణ, బుద్ధ మహాలక్ష్మి, నగేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామోత్సవం మోటుపల్లి వారి వీధి మీదుగా పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి ఆలయానికి చేరుకుంది.



బుట్టబొమ్మలు



ఆలయం వద్ద సందడి

క్రైం కార్నర్

• విద్యుత్ - విషాదం

రెండు కుటుంబాల్లో చీకట్లు

- కరెంట్ షాక్‌తో తాడేపల్లిగూడెంలో భార్యభర్తలు.. ఈదరలో తల్లీకొడుకు మృతి

మోటారు ఆన్‌చేసేందుకు వెళ్లి దంపతులు..



తాడేపల్లిగూడెంలో చనిపోయిన భార్యభర్తలు..
వెంకన్న,అన్నపూర్ణ (ఫైల్)



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: అప్పటివరకు ఎంతో ఆనందంగా ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ సొంత ఇంటినిర్మాణ పనులు చేసుకుని వెళ్లిన ఆ దంపతులను విద్యుత్ తీగలు బలితీసుకున్నాయి. విద్యుత్ షాక్ తగిలిన భార్యను కాపాడేందుకు వెళ్లిన భర్త కూడా విగతజీవిగా పడి మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నివాసం ఉంటున్న గట్టిం వెంకన్న(60) ఇంటి నిర్మాణ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. గురువారం ఉదయం భార్య అన్నపూర్ణ (55)తో కలిసి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం చేసేందుకు వెళ్లి పనులు పూర్తి చేయించుకుని ఇంటికి వచ్చారు. మంచినీటి కోసం మోటారు ఆన్‌చేసేందుకు వెళ్లిన అన్నపూర్ణకు విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై కేకలు వేయగా కాపాడేందుకు వచ్చిన భర్త వెంకన్న కూడా అక్కడికక్కడే విగత జీవిగా పడిపోయాడు. స్థానికులు గమనించే సరికే ఇద్దరూ మృతి చెందారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. సంఘటనా స్థలం వద్ద మృతులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



ఈదర గ్రామంలో తల్లీకుమారుడి మృతదేహాలు

విద్యుత్ వైరు తగిలి.. తల్లీకుమారుడు మృతి

ఆగిరిపల్లి, జూన్ 27: బట్టలు ఆరవేసేందుకు ఏర్పాటు చేసిన తీగకు విద్యుత్ ప్రవహించడంతో దానిని తాకిన దొండపాటి నాగరత్నం(60), ఆమె కుమారుడు రామదాసు(40) మృతి చెందిన ఘటన ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో గురువారం జరిగింది. స్థానిక వణుకూరి ముత్యాలమ్మ ఇంటి ఎదురుగా నివాసముంటున్న దొండపాటి చంటి ఇంటి నుంచి కరెంటును వాడుకుంటున్నారు. దీనికి వారు ఉపయోగించిన విద్యుత్ వైరును నాగరత్నం బట్టలు ఆరేసుకునే ఇనుప స్తంభానికి చుట్టారు. ఆ స్తంభం ద్వారా బట్టలు ఆరవేసే తీగకు కరెంట్ ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో నాగరత్నం బట్టలు ఆరవేసేందుకు వెళ్లి తీగను పట్టుకోవ డంతో విద్యుదాఘానికి గురై కుప్పకూలి విగతజీవిగా మారింది. తల్లిని కాపాడేందుకు వచ్చిన కుమారుడు రామదాసు తీగను పట్టుకోవడంతో మృతి చెందాడు. నాగరత్నంకు భర్త, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమా రులు ఇద్దరూ పక్షవాతంతో బాధపడుతుండగా వారిలో రామదాసు గురువారం మృతి చెందాడు.

బస్సు ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

మరొకరికి గాయాలు

భీమవరం క్రైం, జూన్ 27 : ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు యువకుల్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా.. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం రూరల్ ఎస్ఐ రాజు తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం తుందుర్రు గ్రామానికి చెందిన కోయ రాజేంద్రరామ్(20) మద్రాసులో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల స్వగ్రామం వచ్చారు. గురువారం రాత్రి అతడి స్నేహితుడు జ్ఞాన సత్యేంద్రతో కలిసి ద్విచక్ర వాహనంపై భీమవరం నుంచి తుందుర్రు వెళుతున్నారు. తాడేరు గ్రామ సమీపానికి వచ్చేసరికి వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు వారి వాహనాన్ని ఢీకొంది. ఇద్దరూ కింద పడిపోయారు. రాజేంద్రరామ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితునికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ రాజు అక్కడకు వెళ్ళి వివరాలు సేకరిస్తున్నారు.

రైలు నుంచి జారి పడి ఒకరి మృతి

భీమవరం క్రైం, జూన్ 27 : ఊరు, పేరు తెలియని సుమారు 20-25 ఏళ్ల వయసు గల పురుషుడు విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి రైల్వే కరెంట్ స్తంభం పక్కన పడి చనిపోయాడని భీమవరం రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు రంగుపై నీలం రంగు గడులు కల పొడుగు చేతుల చొక్కా, పసుపు ముక్కుపొడి రంగు గల ఫుల్ బనియన్, నలుపు రంగు సిమెంట్ రంగుల నిక్కరు, నీలం రంగు డ్రాయిర్, నలుపు రంగు ట్రాక్ ఫ్యాంట్, కుడి చేతికి స్టీల్ కడియం, ఐదు పేటల గల తాడు ధరించి ఉన్నాడు. పుట్టుమచ్చలు ఎడమ కాలు తొడమీద ఒక పుట్టుమచ్చ, ఎడమవైపు మెడ మీద ఒక పుట్టుమచ్చ, పిల్లిగడ్డం ఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు 99121 24213, 70939 39777 నంబర్లకు తెలపాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి సూరిబాబు తెలిపారు.

మోటారు సైక్లిస్టును ఢీకొట్టిన వ్యాన్

- మద్యం మత్తులో డ్రైవర్.. చికెన్ వ్యర్థాలతో పాటు మద్యం రవాణా

ఉంగుటూరు,జూన్ 27 :హైదరాబాదు నుంచి చికెన్ వ్యర్థాలతో తోకలపల్లి చేపల చెరువులకు వెళుతున్న బొలేరో వ్యాను డ్రైవర్ మద్యం తాగి వాహనం నడుపుతూ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టిన ఘటన గురువారం ఉదయం జరిగింది. చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపిన నారాయణపురం పెట్రోలు బంకు శివారులో వ్యాన్ ఢీకొట్టడంతో నారాయణపురానికి చెందిన మోటారు సైక్లిస్టు అప్పసాని వెంకటరత్నం అనే వ్యక్తి మోకాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ వాహనంలో చికెన్ వ్యర్థాలతో పాటు మద్యాన్ని రవాణా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించి మద్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌తో పాటు వ్యాన్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



శ్రీవారి ఆలయ హుండీల సొమ్మును లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీవారి హుండీ
ఆదాయం రూ.2.71 కోట్లు

ద్వారకాతిరుమల, జూన్ 27: చిన్న తిరుమలేశుని హుండీల ఆదాయం గడిచిన 24 రోజులకు గాను రూ.2.71 కోట్ల భారీ ఆదాయం సమకూరిందని ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని ప్రమోద కల్యాణమండపం ఆవరణలో గురువారం జరిగింది. అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ జరిగిన హుండీల లెక్కింపు ద్వారా రూ.2,71,10,144 నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 276 గ్రాముల బంగారం, 6.837 కేజీల వెండి, రద్దయిన పాతనోట్లు రూ.500(24), 1000(5), 2000(6)తో పాటుగా పలుదేశాల కరెన్సీ అధికంగా లభించింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూన్ 27 : జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన ఓ యువతి అదృశ్యమైందని ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ పీసీహెచ్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. తన కుమార్తె డిగ్రీ చదివి ఇంటి వద్దనే ఉంటుందని ఈనెల 26వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని చుట్టుపక్కల ఉన్న బంధువుల ఇళ్ల వద్ద ఆచూకీ లభించక పోవడంతో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బుట్టాయిగూడెం మండలం మర్లగూడెం గ్రామానికి చెందిన బందారు దిలీప్‌కుమార్ అనే యువకుడిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 27 : అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ మంగయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన సాయిల వెంకటలక్ష్మికి మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన పెద్దపూడి వెంకట్రాజుకు 2022లో వివాహమైంది. వివాహ సమయంలో కట్నం రూపంలో మూడు లక్షల రూపాయల నగదు, మూడు కాసుల బంగారం, సారె ఇచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాహానికి ముందే మద్యం, జూదం అలవాట్లు ఉన్న వెంకట్రాజు అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తున్నాడని అతడితో కుటుంబ సభ్యులు కూడా సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

టైరు పేలి పామాయిల్ గెలల లారీ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

చింతలపూడి, జూన్ 27: పామాయిల్ గెలల లోడ్‌తో వస్తున్న లారీ కారును తప్పించబోయి టైరు పేలడంతో మలుపువద్ద బోల్తా పడిన ఘటన చింతలపూడి మండలం ప్రగడవరం వద్ద జరిగింది. గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగిన సమయంలో వాహనాలు, స్థానికులు లేకపోవడం పెద్ద ప్రమాదం తప్పింది. లారీలోని పామాయిల్ గెలలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. చింతలపూడి మండలం సీతానగరం ఫ్యాక్టరీకి నిత్యం పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో పామాయిల్ లోడు లారీలు కనెక్షన్ పాయింట్ల నుంచి తరలిస్తుంటారు. గుంతల రోడ్డు వల్ల ఒక్కోసారి గెలలు ఎగిరిపడి రోడ్లపై పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధిక లోడ్ వేయకుండా పైన పరదాలు కప్పి తీసుకువెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బోల్తాపడిన లారీ





తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, జూన్ 27: రైతుల సమస్యలు పరిష్కరించాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సమస్యలపై గురువారం ధర్నా నిర్వహించారు. రైతులను ఆదుకోవాలని కార్యాలయం సూపరిం టెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు రూ.20వేలు ఖరీఫ్ సీజన్‌లోనే అందించేందుకు కృషిచేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని, ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్ రద్దుబిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని కోరారు. శివారు భూములకు నీరు అందించేందుకు కాలువల్లో పూడికలు తీయాలని, ధాన్యం బకాయిలు రూ.1600కోట్లు తక్షణం అందజేయాలని డిమాండ్ చేశారు. ఉప్పులూరి హేమశంకర్, మావూరి విజయ, జి.కనకదుర్గారావు, పొటేలు పెంటయ్య, కె.రాంబాబు, ఉప్పులూరి లక్ష్మి, భవాని, జి.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా రుణ పరిమితి పెంచాలని ఏపీ కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. జిల్లా రైతుసంఘం అధ్యక్షులు పుల్లారి సోమశేఖరాచార్యులు మాట్లాడుతూ నీటి పారుదల ప్రాజెక్టుల కింద ప్రధాన పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలని, బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, 90శాతం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని, విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు ఎస్‌కె కాలీష, కంచర్ల గురవయ్య, ఎస్‌కె జానీ, తదితరులు పాల్గొన్నారు.

దోసపాడు పేదలకు న్యాయం చేయాలి



వినతిపత్రం ఇస్తున్న రైతులు, నేతలు

దెందులూరు, జూన్ 27: మండలంలోని దోసపాడు పేదలకు జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం దోసపాడు పేద రైతులు, కూలీలు నిరసన తెలిపారు. దోసపాడు దళితులు కొంత కాలంగా అసైన్డ్, సీలింగ్, గయ్యాళ భూములను పేదలకు పంచాలని కోరుతూ పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై జాయిట్ కలెక్టర్ కోర్టు అసలైన పట్టాదారులకు పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా అమలు చేయడం లేదని ఆరోపించారు. అనంతరం రామకృష్ణ, దోసపాడు పేదలు డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పాఠశాలలో వాటర్‌ట్యాంకు పరిశీలించిన డీఈవో



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 27: నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలును డీఈవో అబ్రహం గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిశుభ్రతపై టీచర్లకు పలు సూచనలు చేశారు. పాఠశాల భవనం పైఅంతస్తులో మంచినీటి ట్యాంకును స్వయంగా పరిశీలించారు. తాగునీటి ట్యాంకును పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బ్లీచింగ్ పౌడర్‌తో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. వర్షాకాలంలో బాలబాలికలకు శుద్ధిచేసిన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. వేసవి సెలవుల అనంతరం ఎంతమంది విద్యార్థులు కొత్తగా చేరారని అడిగి తెలుసుకున్నారు. తరగతులకు గైర్హాజరయ్యే విద్యార్థుల గురించి వారి తల్లితండ్రులకు క్లాసు టీచరు ఫోన్‌చేసి పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి



తాగునీటిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

లింగపాలెం, జూన్ 27:ప్రతి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని ఈవోపీఆర్డీ జేఎం రత్నకుమార్ అన్నారు. పాఠశాలలు, ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు శుభ్రం చేయించాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. పలుప్రాంతాల్లో గురువారం పారిశుధ్యం పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వర్షాకాలం పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు, మురుగునీరు పారేందుకు కాలువలు తీయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తాతయ్య, ప్రవీణ్, పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు హెలెన్ కెల్లర్ ఆదర్శం



హెలెన్ కెల్లర్ చిత్రపటం వద్ద నివాళి

ఏలూరు రూరల్, జూన్ 27: దొండపాడులోని పరివర్తన్, బధిరుల పాఠశాల, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతి గురువారం నిర్వహించారు. సికింద్రాబాద్ ఎన్‌ఐఎం హెచ్ స్పెషల్ ఎడ్యుకేటర్ అంజిరెడ్డి, ఎగ్జిక్యూట్ డైరెక్టర్ ఎస్.వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులు వారి లోపాలను చూసి కృంగిపోకుండా కెల్లర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరెడ్డి, పునరావాస కేంద్రం సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల నిర్మాణాల అనుమతులు నిలిపివేయాలి

బుట్టాయగూడెం, జూన్ 27: ఏజెన్సీ ప్రాంతంలో ఎల్‌టీఆర్, 1/70 చట్టం పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇస్తూ జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఇచ్చిన ల్యాండ్ కన్వర్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏపీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలకు అనుమతులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. ఏజెన్సీలో శాశ్వత భవనాల నిర్మాణాలకు ఆర్డీవో, బుట్టాయగూడెం తహసీల్దార్ అనుమతులు ఇవ్వడం సరైంది కాదని, అధికారులు ఏజెన్సీ చట్టాలకు లోబడి పనిచేయాలన్నారు. 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీలో అమ్మకాలు, కొనుగోలు జరగాలన్నా కలెక్టర్ అనుమతి ఉండాలని ఏజెన్సీలో ఇవేమి కానరావడం లేదన్నారు. చట్టవిరుద్ధంగా భూములు కొనడమేకాకుండా వాటిలో షాపింగ్ కాంప్లెక్స్‌లు కట్టడంపై కలెక్టర్, ఐటీడీఏ పీవో జోక్యం చేసుకోవాలని గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జి.పవన్, కె.జలపాలు, పి.దుర్గారావు, కె.రాములు, కె.వెంకటేశ్వరావు, యు.వెంకటేసు, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు క్రైం, జూన్ 27 : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు - వ్యాను ఢీకొన్న ఘటనలో ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం గాలాయగూడెం గ్రామానికి చెందిన కూచిపూడి అర్జున్ (20), ఉప్పాటి శ్యామ్ బాబు (20) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద స్థలానికి సమీపంలోనే ఉన్న నల్లజర్ల ఎస్ఐ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో కలిసి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హుటాహుటిన ఏలూరు ఆసుపత్రికి చేరుకుని బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులకు వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేలా చూడాలని, సంబంధిత వైద్యులు అందుబాటులో లేకపోతే క్షతగాత్రులను సంబంధిత స్పెషాల్టీ హాస్పిటల్స్‌కు ప్రభుత్వ అంబులెన్స్‌లో తరలించి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగం వైద్యులకు సూచించారు. క్షతగాత్రుల బంధువులతో మాట్లాడుతూ అధైర్యపడవద్దని, అన్ని విధాలా తాను అండగా ఉంటానని చింతమనేని ప్రభాకర్ భరోసా ఇచ్చారు. అనంతరం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రమాద, అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు.



ఐటీడీఏలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే, పీవో



ఏలూరు అన్న క్యాంటిన్ పరిశీలించిన ఎమ్మెల్యే చంటి



వృద్ధురాలి సమస్యపై ఆర్డీవోతో మాట్లాడుతున్న చింతమనేని



ట్రాఫిక్ క్లియర్ చేయిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

పాలన పరుగులు

సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనల్లో ఎమ్మెల్యేలు

టీడీపీ కూటమి కొత్త ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు పాలన పరుగులు పెట్టిస్తున్నారు. నూతన, సీనియర్ ఎమ్మెల్యేలు సైతం వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యాంశాలపై అధికారులతో చర్చించి అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి ప్రజలతో మాట్లాడుతున్నారు.

వైద్య సిబ్బంది పనితీరు మారాలి : చిర్రి బాలరాజు

బుట్టాయగూడెం, జూన్ 27: ఐటీడీఏ పరిధిలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, ఉద్యోగులను కూర్చోబెట్టి జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హెచ్చరించారు. ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ అధ్యక్షతన ఏజెన్సీలో 25 శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని, ఆసుపత్రులు, సిబ్బంది పనితీరుపై ఆకస్మిక తనిఖీ చేస్తానన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. ప్రసవాలకు ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటే ఇతర ఆస్పత్రులకు ఎందుకు రిఫర్ చేస్తున్నారని డీఎంవో జె.సురేష్‌కుమార్‌ను ప్రశ్నించారు. కేఆర్ పురం కేంద్రంగా పనిచేసే మలేరియా కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి ఎందుకు తరలించారని, ఏజెన్సీలో ఏర్పాటు చేసి ఇక్కడ నుంచే పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పీవోను కోరారు. కమిషనర్‌కు లేఖ రాశామని, ఉన్నతాధికారుల పరిధిలో ఉందని పీవో చెప్పారు. మలేరియా కేసులు అధికంగా ఉండే ఏజెన్సీలోనే కార్యాలయం ఉండడం మంచిదని ఎమ్మెల్యే సూచించడంతో చర్యలు తీసుకుంటామని పీవో తెలిపారు. వైద్య సిబ్బంది ఇబ్బందులు తన దృష్టికి తేవాలని, సేవలందించడంలో అలసత్వం వద్దన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు, ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు, నిర్వాసితుల భూవివాదాలు, విద్య వైద్యం, వసతి సదుపాయాలు, ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అందిస్తున్న పథకాలు, రోడ్ల దుస్థితి సంక్షేమ అమలు తదితర వాటిపై సమీక్షించారు. ఏపీవో వీవీఎస్ నాయుడు, ఎస్‌డీసీ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. జనరల్ వార్డు, డెలివరీ రూం, ల్యాబ్ గదులను పరిశీలించారు. ఆస్పత్రిలో పేషెంట్ శిరిశెట్టి రామారావును వైద్య సేవలపై ఆరా తీశారు. సాధ్యమైనంతవరకు ఆస్పత్రిలో వైద్యం అందించాలని డాక్టర్ గాయత్రికి సూచించారు. ప్రజలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. స్టాఫ్ నర్సు కుమారి, సిబ్బంది కేశవ్, రాంపండు, రాజు ఉన్నారు.

ప్రాథమిక దశ నుంచే మంచి విద్యాబోధన

కొయ్యలగూడెం: ప్రాథమిక దశ నుంచే పిల్లలకు మంచి విద్యాబోధన అందించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బయ్యన్నగూడెం పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. దీనికి ఉపాధ్యాయులు అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో తేజ, మండల జనసేన అధ్యక్షుడు రవి, పారేపల్లి నరేష్, పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తాం : బడేటి చంటి

ఏలూరు టూటౌన్: అన్న క్యాంటీన్లు పునరుద్ధరించి పేదవాడికి రూ.5కే కడుపునిండ భోజనాన్ని పెడతామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ వెంకటకృష్ణతో కలసి అన్నక్యాంటీన్లను ఎమ్మెల్యే చంటి గురువారం సందర్శించారు. తంగెళ్ళమూడి, వన్‌టౌన్‌లో అన్న క్యాంటీన్‌లు పరిశీలించారు. నగరంలో నాలుగు అన్న క్యాంటీన్లు ఉన్నాయని, మరమ్మతులు చేసి త్వరలోనే పునరుద్ధరిస్తామన్నారు. అన్న క్యాంటీన్లు మూసివేసి వైసీపీ ప్రభుత్వం పేదవాడి పొట్ట కొట్టిందన్నారు. వంగాయిగూడెం నుంచి మినీ బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ కృష్ణకాల్వపై రూ.5కోట్లతో బ్రిడ్జి నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని ఆయన పరిశీలించి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. చోడే వెంకటరత్నం, ఎంఆర్డీ బలరాం, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమమే అజెండా : చింతమనేని ప్రభాకర్

పెదవేగి: సంక్షేమమే అజెండాగా చంద్రబాబునాయుడు సారధ్యంలో పాలన సాగుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పింఛన్లు, సంక్షేమ పథకాల సమస్యలపై స్పందించిన ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలు జగన్‌రెడ్డి పాలనలో నరకాన్ని చూశారన్నారు. ఇకపై అంతా సంక్షేమమే, తప్ప సంక్షోభం అనే మాటకే తావు ఉండదన్నారు. పింఛన్లు, సంక్షేమ పథకాల అమలులో అర్హులకు అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. గుండుగొలనుకు చెందిన వృద్ధురాలి భూసమస్యను పరిష్కరించాలని ఫోన్‌లో ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, రక్షిత తాగునీరు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. సీఈవో కె.సుబ్బారావు, డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఎంపీడీవోలు వెంకటరమణ, ప్రణవి, నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మంచినేని శ్రీనివాసరావు, మాగంటి నారాయణ ప్రసాద్, మేరుగు నాగరాజు, మోతుకూరి నాని, తలకొండ జమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కుదరదు : రోషన్ కుమార్

లింగపాలెం: ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకోబోమని, అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఏలూరు - చింతలపూడి ప్రధాన రహదారిపై ఈదురుగాలులకు జూబ్లీనగర్‌లో చెట్టు విరిగిపడి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అటు వైపు వెళుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్ గమనించి స్వయంగా అక్కడే ఉండి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూశారు. అధికారులకు ఫోన్‌చేసి వెంటనే రోడ్డుపై పడిన చెట్టును తొలగించేలా చర్యలు చేపట్టారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. ఆయన స్వయంగా రోడ్డుపై చెట్టుకొమ్మలను తొలగించారు. ఆయనతో పాటు మోరంపూడి మల్లికార్జున్‌రావు, తాతిన రాధాకృష్ణ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సమస్యలపై సమీక్ష

చింతలపూడి: స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల సమస్యలపై ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తన కార్యాలయంలో ప్రిన్సిపాల్, వార్డెన్‌లతో సమీక్ష జరిపారు. పారిశుధ్యం, మెనూ విషయంలో తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, వార్డెన్‌లు నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదన్నారు. పాఠశాల సమస్యలను ప్రిన్సిపాల్ కిశోర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. భవన నిర్మాణాలు పూర్తయితే మెరుగైన సౌకర్యం కలుగుతుందని, వర్షాలకు పాఠశాల ఆవరణ మునుగుతుందని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.







ఏలూరులో హెచ్‌ఎంలతో ఎంఈవోల సమావేశం, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

విద్యా ప్రవేశం విజయవంతం చేయాలి

ఏలూరు రూరల్, జూన్ 27: దీక్షా యాప్‌లో విద్యాప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంఈవోలు ఎ.రవిప్రకాష్, ఆర్.రంగయ్య, ఉపాధ్యాయులను కోరారు. మండలంలో ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. దీక్షాయాప్‌లో పాఠశాలల వివరాల నమోదుపై జిల్లా నోడల్ కోఆర్డినేటర్ శ్రీహరి వివరించారు. ఏఎంవో రామారావు దీక్షా యాప్ ఆవశ్యకత, పాఠశాల స్థితిగతులను పొందుపరిచే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఏలూరు రూరల్, అర్బన్ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

● పెదపాడు: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని ఎంఈవో-2 ఎస్.నరసింహమూర్తి తెలిపారు. కొత్తముప్పర్రులో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠశాల, విద్య ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. ఉచిత విద్యతో పాటుగా పూర్తిస్థాయి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారన్నారు. హెచ్‌ఎం. వైఎస్‌వి.పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● టినరసాపురం: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంపీడీవో కె.జోగేశ్వరరావు అన్నారు. మండల వనరుల కేంద్రంలో ఎంఈవోల ఆధ్వర్యంలో విద్యాప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేలా హెచ్‌ఎంలు సర్వేచేయాలన్నారు. ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కల్యాణి, రామ్‌ప్రసాద్, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్‌లు పంపిణీ

విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి సూచించారు. కేతవరం పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. నాయుడు రామకృష్ణారావు గౌడ్, అడపా నాగరాజు, వెలిది నాగబాబు, కేతవరం ఉపసర్పంచ్ భీమవరపు జగన్మోహన్‌రావు, జయ్యవరపు శ్రీనివాసరావు, హెచ్‌ఎం టి.మల్లయ్య, ఉపాధ్యాయులు గ్రేస్ మార్త, సునీత, బి.వీర నాగమణి తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: శ్రీరామనగర్ కాలనీ పాఠశాల విద్యార్థులకు జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు పుస్తకాలు, బ్యాగ్‌లు, లంచ్ బాక్సులు పంపిణీ చేశారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రెడ్డి గౌరీశంకర్, వేముల బాలు, లావేటి రమణ, రావాడ లక్ష్మణరావు, రవి, బాలరాజు, మన్యం కృష్ణ, పర్సా రాంబాబు, రాయవరపు బుల్లబ్బాయ్, మావూరి గంగాధరరావు, గంపా విఠల్, పర్సా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: నాగిరెడ్డిగూడెం ఎంపీపీ పాఠశాలలో కూటమినేతలు, విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. పక్కాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కె.శేషగిరిరావు, అనిష్‌కుమార్, పలువురు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ప్రాథమిక పాఠశాల (మెయిన్) విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కరుటూరి రమాదేవి, నాయకులు తూటిగుంట రాము, చిట్రోజు తాతాజీ, పగడం సౌభాగ్యవతి, బాలబ్రహ్మం, గుళ్ళపూడి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణపురంలో వైకల్య నిర్ధారణ శిబిరం



వైకల్యం పరీక్షిస్తున్న వైద్య బృందం

ఉంగుటూరు, జూన్ 27: దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ శిబిరం నారాయణపురం హైస్కూలులో గురువారం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన శిబిరంలో వైకల్య నిర్ధారణ ఆధారంగా దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయనున్నట్లు అదనపు ప్రాజెక్టు అధికారి బి.సోమశేఖర్ తెలిపారు. శిబిరం సమన్వయకర్త బొర్రా భాస్కరరాజు మాట్లాడుతూ ఐదు మండలాల భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్రభారతి, నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకనంద, ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం షేక్ మీరా సాహెబ్, 150 మంది దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

ఉంగుటూరు, జూన్ 27: ఆయుర్వేద ఆసుపత్రిలో డాక్టర్ కస్తూరి శిరీష ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు రక్తపోటు, కీళ్ళ సమస్యలు, అజీర్ణం, మధుమేహం తదితర రోగాలను పరీక్షించారు. 96 మంది వృద్ధులను పరీక్షించి మందులు అందించారు.

ఏరియా ఆసుపత్రిలో టీడీపీ నేతల పరిశీలన

జంగారెడ్డిగూడెం, జూన్ 27: పట్టణంలోని ఏరియా ఆసుపత్రి రోగులకు భోజన సౌకర్యాన్ని గురువారం టీడీపీ నాయకులు పరిశీలించారు. భోజన పదార్థాలను రుచిచూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆసుపత్రిని పరిశీలించగా భోజనం రుచిగా లేదని ఫిర్యాదులందాయన్నారు. ఎమ్మెల్యే సూచనతో నాయకులు ఆస్పత్రిలో రోగులను ఆరా తీశారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామన్నారు. తూటిగుంట రాము, కరుటూరి రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.



గోతులమయమైన కుక్కునూరు - అశ్వారావుపేట రహదారి



నాసిరకం గ్రావెల్‌తో బురదమయమైన కుక్కునూరు-దాచారం రహదారి

అధ్వాన రహదారులు

కుక్కునూరు, జూన్ 26: కుక్కునూరు-భద్రాచలం, కుక్కునూరు-అశ్వారావుపేట మధ్య 40 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గోతులమయమైన రోడ్డుపై ప్రయాణంలో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఐదేళ్లుగా ప్రజలు ఈ రహదారి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణం పూర్తిచేయలేదు. ఎన్నికల సమయంలో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ కుక్కునూరు ప్రధాన రహదారిపై రోడ్డుషో నిర్వహించారు. స్థానిక నాయకులు రహదారి సమస్యలు ఆయనకు వివరించారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఈ రహదారి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఎంపీగా గెలుపొందడంతో ఇటీవల టీడీపీ నాయకులు కలసి రహదారి నిర్మాణంపై మరోసారి గుర్తుచేశారు.

నాలుగు రోజుల పాటు వర్షాలు కురియడంతో రహదారిపై గోతుల్లో నీరు నిలిచింది. శిథిలావస్థకు చేరిన రహదారిపై వాహనాలు నడపలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లుపడుతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.

కుక్కునూరు, దాచారం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పనులు నాసిరకంగా మారాయి. ఇటీవల రూ.15 లక్షలతో బీటి నిర్మాణ పనులు చేపట్టారు. కొండేటివాగు, లోలెవెల్ కాజ్‌వే‌కు ఇరువైపులా గ్రావెల్ పోశారు. గ్రావెల్ నాసిరకంగా ఉండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. నిత్యం 15 గ్రామాల ప్రజలు కొండేటివాగు మీదుగా కుక్కునూరు వైపు ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తారు. గ్రావెల్ నాసిరకం కావడంతో బురదమయంగా మారి వాహనాలు నడపలేని పరిస్థితి ఏర్పడింది. నాణ్యమైన గ్రావెల్ పోస్తే ఈ పరిస్థితి తప్పేదని, అధికారులు నాణ్యమైన గ్రావెల్‌ను వేసేలా చూడాలని కోటగిరి సత్యనారాయణ కోరారు.

కలెక్టర్‌ను కలసిన వీఆర్వో సంఘ నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు

ఏలూరు కలెక్టరేట్, జూన్ 27: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెట్రిసెల్విని గురువారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు, అసోసియేషన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. వీఆర్వోలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలు తెలియజేస్తే పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారని రాంబాబు తెలిపారు.

రామోజీకి నివాళి



ఏలూరు టూటౌన్, జూన్ 27: విజయవాడలో జరిగిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు సంస్మరణ కార్యక్రమంలో పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి కార్యక్రమంలో పాల్గొని రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు సత్కారం

ద్వారకాతిరుమల, జూన్ 27: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును తిమ్మాపురానికి చెందిన పలువురు టీడీపీ నేతలు గురువారం సత్కరించారు. నేతలు తూంపాటి పద్మవర ప్రసాద్, ఘంటా అచ్యుత రామయ్య, వాసిరెడ్డి ప్రవీణ్‌కుమార్, వాసిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 27: మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అగ్రహారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వవున్నచోట దోమలు వృద్ధిచెంది, వాటిద్వారా మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు వ్యాప్తిచెందుతాయన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతే ముఖ్యమన్నారు. వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, విజయమేరీ, వెంకటలక్ష్మి, స్కూలు హెచ్‌ఎం సుధాకర్ పాల్గొన్నారు.

ముగిసిన డీఎల్‌ఎడ్ సెమిస్టర్ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 27: జిల్లాలో గురువారం జరిగిన డీఎల్‌ఎడ్ సెమిస్టర్ పరీక్షకు 60మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు. పరీక్షలు ముగిశాయని వివరించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** నగర పాలక సంస్థ అధికారులు ఇష్టానుసారం ఆస్తి పన్నులు పెంచేస్తున్నారని సామాజికవేత్త వై.ఆనందనాయుడు ఆరోపించారు. గతంలో అద్దె విలువ ఆధారంగా పన్ను వసూలు చేస్తే ఇప్పుడు ఆస్తి విలువ ఆధారంగా పన్ను వసూలు చేస్తున్నారన్నారు. ఫలితంగా ప్రతీ ఏడాది 25శాతం పన్ను పెరుగుతుందన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడును మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు సత్కరించారు.
- ఏలూరు ఆర్‌ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయం హుండీని లెక్కించగా 90 రోజులకు 9,74,795 రూపాయలు ఆదాయం లభించినట్టు పర్యవేక్షకులు మీసాల వెంకట్రావు, ఈవో నాగం సన్యాసిరావులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.
- ఏలూరు ఆదివారపుపేటలోని షిరిడీ సాయి ప్రేమమందిర్‌లో బాబా వారికి పంచామృతాభిషేకం చేశారు. విశేష అలంకరణ చేసి ప్రత్యేక హారతులు ఇచ్చి నివేదనలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.
- **కామవరపుకోట :** గత ప్రభుత్వం కుటుంబంలో వృద్ధ దంపతుల్లో ఒకరికే పెన్షన్ మంజూరు చేసేవారని, ఒకరికే పెన్షన్‌తో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఇద్దరికీ పెన్షన్లు మంజూరుచేయాలని సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు డిమాండ్ చేశారు.
- కామవరపుకోట రామాలయం ప్రాంగణంలో షిరిడీసాయి మందిరం, తేలీలబజారులోని షిరిడీ సాయి మందిరం, కొత్తూరులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయప్రాంగణంలోని షిరిడీ సాయి మందిరం వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు.
- **ఉంగుటూరు :** మానవత మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు సాగిరాజు జానకి రామరాజు తెలిపారు. అధ్యక్షుడిగా వేగేశ్న రంగరాజు, కార్యదర్శిగా గంజి రవి కుమార్, కోశాధికారిగా పీవీవీఎస్.ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. పుప్పాల గోపి, సూర్యనారాయణ రాజు, బొమ్మిడి అప్పారావు, గుణ్ణం బుల్లెబ్బాయి పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** వెలగపాడు 33-11కె.వి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కె.వి లైన్‌లో చెట్లు కొట్టు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని జంగారెడ్డిగూడెం డీఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే వనమాడిని కలిసిన టీడీపీ నేత నాని



కైకలూరు, జూన్ 27: కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు)ను కైకలూరు టీడీపీ నాయకుడు బీకేఎం నాని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని నాని అన్నారు. గురువారం విజయవాడలో ఎమ్మెల్యే కొండబాబును కలిసినట్లు తెలిపారు.

దాతల సహకారంతో 9వ రోజు అన్న క్యాంటీన్



దాతలను సత్కరిస్తున్న కూటమి నాయకులు

కైకలూరు, జూన్ 27: పేదవాడికి పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్‌ను ఐదేళ్లుగా జగన్మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేశారని కూటమి నేతలు మండిపడ్డారు. కైకలూరులో అన్న క్యాంటీన్‌ను తొమ్మిదో రోజు గురువారం భుజబలపట్నంకి చెందిన దండు రాము కుమారుడు దండు వర్మ ఆర్థిక సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. ప్రభాస్ కల్కి చిత్రం విడుదల సందర్భంగా వీరు పేదలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. దాతలను కూటమి సభ్యులు సత్కరించారు. కూటమి నాయకులు పూల రామాచంద్రరావు, కొల్లి వరప్రసాద్, పేరిచర్ల ప్రసాదరాజు, ఏఈ శ్రీనివాస్, తోట లక్ష్మీ, వీరాబత్తిన సుధా, అద్దంకి రమేష్ రాజు, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ముగురి సిబ్బంది నియామకం

చాట్రాయి, జూన్ 27: మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో మండలంలోని చిన్నంపేట జడ్పీ హైస్కూల్‌లో మంజూరైన కో-ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీకి ముగురి టీచింగ్ సిబ్బందిని నియమించారు. వైసీపీ ప్రభుత్వంలో గతేడాది కళాశాలను మంజూరు చేశారు. కానీ సిబ్బంది నియామకం జరగలేదు. జిల్లా టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరు శ్రీనివాసరావు మంత్రికి సమస్య వివరించడంతో వెంటనే స్పందించి టీచింగ్ సిబ్బందిని నియమించాలని డీఈవోను కోరారు. ఈ కళాశాలలో ఎంపీసీలో 40, సీఈసీలో 40 సీట్లు ఉన్నాయని, ఇప్పటికే 55 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారని త్వరలో క్లాసులు మొదలవుతాయని ఎంఈవో వీఎస్వీ బ్రహ్మచారి చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

ముసునూరు, జూన్ 27: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బీవీ సుబ్బారావు ఆదేశించారు. ముసునూరు విద్యాశాఖ కార్యాలయంలో గురువారం విద్యా ప్రవేశాలపై అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యా ప్రవేశంలో భాగంగా వచ్చే నెల 25వ తేదీ వరకు విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టి, అనంతరం ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, లక్ష్యాలను నిరారించుకోవాలని సూచించారు. జూలై ఒకటి నుంచి నిర్దేశించి విద్యార్థుల నమోదు, లక్ష్యాల సాధనపై వర్కింగ్ కమిటీలను ఏర్పాటు చేసుకుని వివిధ నమోదు కార్యకలాపాలను నిర్వహించాలన్నారు. గతేడాది కంటే విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎంలు నాగేంద్రరావు, రామకృష్ణారావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఫీజు చెల్లింపు

నూజివీడు టౌన్, జూన్ 27: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుర్రా పద్మ, సోమ్‌బాబు జ్ఞాపకార్థం నూజి వీడు శారద కళాశాల విద్యార్థి నికి ఫీజు చెల్లించారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ చైర్మన్ పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభ ఉండి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకోలేని వారికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలుస్తుందన్నారు. మచిలీపట్నంకు చెందిన చెలికంటి నాగమణి, ఆమె సోదరి జ్ఞాపకార్థం శారద కళాశాలలో చదువుతున్న విద్యార్థికి ఫీజును చెల్లించారన్నారు.

హెచ్‌సీ, కానిస్టేబుల్‌కు ఎస్పీ ప్రశంస



హెచ్‌సీ శంకరరావుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ముదినేపల్లి, జూన్ 27 : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి లో ఇటీవల నమోదైన పలు కీలక సెక్షన్ల కేసుల్లో దర్యాప్తు చేయటంలో అత్యంత ప్రతిభ చూపిన స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ టి.శంకరరావు, కానిస్టేబుల్ నాగబాబును ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు. ఏలూరులో తన కార్యాలయంలో గురువారం పైఇరువురిని అభినందించి నగదు ప్రోత్సహకాలను ఎస్పీ అందజేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామంలో ఒక వ్యక్తి ఓ మహిళతో సహజీవనం బాలిక అయిన ఆమె కుమార్తెపై కూడా అత్యాచారం చేసిన కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేయడంతో పోలీస్ అధికారులకు సహకరించినందుకు హెచ్‌సీ శంకరరావు, కానిస్టేబుల్ నాగబాబుకు ఎస్పీ నగదు రికార్డు అందజేశారు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్‌లను కూడా ఎస్పీ అభినందించారు.

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



పాడి పశువులకు వేస్తున్న గాలికుంటు వ్యాధి టీకా

చాట్రాయి, జూన్ 27: కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని చీపురుగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన పాడి పశువులకు గాలికుంటు వ్యాధి వాక్సీనేషన్‌ను సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి ప్రారంభించారు. వీరు మాట్లాడుతూ పాడి పశువుల ఆరోగ్యం, పాలఉత్పత్తిని కాపాడుకోటానికి రైతులు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. వర్షాకాలంలో పశువుల్లో వచ్చే గాలికుంటు, గురక, జబ్బువాపు మొదలైన వ్యాధుల లక్షణాలు నివారణ పద్ధతుల గురించి పశు వైద్యులు సోహెల్, అహ్మద్, కృష్ణా రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. రూట్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, వేతన కార్యదర్శి పాపోతు రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

గృహ సోలార్ యూనిట్ ప్రారంభం



చాట్రాయిలో గృహ సోలార్ యూనిట్ ప్రారంభిస్తున్న అధికారులు

చాట్రాయి, జూన్ 27: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద, చాట్రాయిలో ద్రోణంరాజు శ్రీనివాసరావు గృహంలో ఏర్పాటు చేసిన 2కేవీ సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్‌ను గురువారం విస్సన్నపేట సబ్ డివిజన్ విద్యుత్ ఏడీఈ నారాయణ ప్రారంభించారు. చాట్రాయి, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల పరిధిలో ఏర్పాటైన తొలి యానిట్ ఇది కావటం విశేషం. ఏడీఈ మాట్లాడుతూ 2 కేవీ సోలర్ యానిట్ విలువు రూ.1.35 లక్షలు కాగా, కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూ.60 వేలు అని, మిగతా రూ.75 వేలు లబ్ధిదారుడు చెల్లించారని అన్నారు. ఈ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవటం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గించుకోవచ్చుననని అన్నారు. ఏఈ సంజయ్, లైన్‌మెన్ రాజు పాల్గొన్నారు.

నడక యాతన

- గుంతలతో భయపెడుతున్న లంక గ్రామాల రహదారులు
- పడుతూ లేస్తూ ప్రయాణాలు
- గాయాల పాలవుతున్న వాహనదారులు
- నిలిచిన ఆర్టీసీ సర్వీసు



కంకర తిరగేసిన వదిలేసిన గుర్వాయిపాలెం - పెదలంక ప్రధాన రహదారి

కలిదిండి, జూన్ 27 : లంక గ్రామాల రహదారులు గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో పాదచారులు, వాహనచోదలు నరక యాతన పడుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణం చేయడానికి ద్విచక్ర వాహన దారులు భయాందోళన చెందుతున్నారు. మూల్లంక నుంచి పెదలంక వరకు ఆరు కిలోమీటర్ల మేర రహదారి కంకర తిరగేసి తారు వేయకుండా వదిలేశారు. దీంతో రహదారి గుంతలు పడి అధ్వానంగా మారి ప్రయాణించేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో మచిలీపట్నం - పెదలంక ఆర్టీసీ బస్సు నిలుపుదల చేశారు. రహదారి మరమ్మతులు చేస్తేనే బస్సు రాకపోకలు సాగిస్తుందని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. మద్వాని గూడెం - మట్టగుంట రహదారి కూడా సుమారు ఏడు కిలోమీటర్ల మేర గుంతలు పడడంతో రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో వాహనాలు గుంతల్లో దిగబడుతున్నాయి. చేపలు, రొయ్యల చెరువులు అధికంగా ఉండటంతో నిత్యం తవుడు లోడు లారీలు చేపల ఎగుమతుల లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి గోతులు పడడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో ఆక్వా రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. లంక గ్రామాల ప్రధాన రహదారులను అభివృద్ధి పర్చాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ఎన్నికల సమయంలో అధికార పార్టీ నాయకులు రోడ్లు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధి పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లంక గ్రామాల ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.11 కోట్లు మంజూరు

లంక గ్రామాల ప్రధాన రహదారికి రూ.11 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తి కాగానే రోడ్ల నిర్మాణ పనులు చేపడతాం.

- విజయ శ్రీకర్, ఆర్‌అండ్‌బీ డీఈఈ

త్వరలో ఉన్నత స్థాయి సమావేశం

ముదినేపల్లి, జూన్ 27 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు త్వరలో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆప్కాబ్ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకుడు తొండెపు దశరథ జనార్దన్ హామీ ఇచ్చారు. ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పలువురు యూనియన్ నాయకులు జనార్దన్‌ని కలసి తమ దీర్ఘకాలిక సమస్యలను వివరించారు. ప్రధానమైన ఎంపాయిస్ హెచ్ఆర్ పాలసీ బదిలీలు, సిబ్బంది నియామకాలు, జీతాల బకాయిల విడుదల తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంప్లాయిస్ సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి, పరిష్కారానికి త్వరలోనే సమావేశం నిర్వహించేందుకు సహకార శాఖ, సహకార బ్యాంక్ ఉన్నతాధికారులతో చర్చిస్తానని జనార్దన్ హామీ ఇచ్చినట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘురామ్ తెలిపారు. ఈ సందర్భంగా జనార్దన్‌ను యూనియన్ నాయకులు సత్కరించారు.

ఇక పీఏసీఎస్‌ల్లో పీఐసీల పాలన

ముదినేపల్లి, జూన్ 27 :ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎట్టకేలకు పర్సన్ ఇంచార్జ్‌ల నియామక ప్రక్రియ పూర్తయింది. గత ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలు రద్దు కావడంతో వాటి స్థానంలో పీఏసీఎస్‌లకు పీఐసీలను నియమిస్తూ రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజులుగా ఈ నియామకాలపై జరిగిన కసరత్తు గురువారం పూర్తయింది. డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌తోపాటు డీసీసీబీ బ్రాంచిల అసిస్టెంట్ మేనేజర్లు, స్టాఫ్ అసిస్టెంట్లను పీఐసీలుగా నియమించినట్లు తెలిసింది. సంఘాలకు ఎన్నికలు జరిగే వరకు పీఐసీల పాలన జరుగనుంది. 2013లో సహకార సంఘాలకు ఎన్నికలు జరుగగా, 2018లో పాలకవర్గాల కాల పరిమితి ముగిసింది. అయితే పాలకవర్గాలను ఏడాది పాటు అప్పట్లో ప్రభుత్వం పొడిగించింది. 2019లో ప్రభుత్వం సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ కమిటీలను నియమించింది. ఐదేళ్ల పాటు ఆ త్రిసభ్య కమిటీల ఏలుబడిలోనే సంఘాలు ఉండగా, కొత్తగా ఏర్పడిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం నామినేటెడ్ కమిటీలను రద్దు చేసింది. దీంతో సంఘాల్లో కార్యకలాపాలకు ఆటంకం లేకుండా ప్రభుత్వం గురువారం పీఐసీలను నియమించింది.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ముసునూరు, జూన్ 27: వేల్పుచర్ల ఏస్టీకాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సామగ్రిని గురువారం టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. నాయకులు గరికముక్కు నాని, లక్ష్మణ్, పెద్దిరాజు, తిరుపతిస్వామి, దేవేంద్ర, వెంకటేశ్వరావు, మాదవరావు విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్‌లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలో సమస్యలను తెలుసుకున్న నాయకులు ఈ పాఠశాలలో పర్మినెంట్ ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం నాని సొంత ఖర్చులతో అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న 20 చిన్నారులకు పలకలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు

డ్వామా పీడీ రాము



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాము

చాట్రాయి, జూన్ 27: ఉపాధి హామీ పథకం ద్వారా అమలవుతున్న వివిధ పథకాల గురించి ప్రజలకు వివరించకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ, ఏపీవో, సిబ్బందిపై డ్వామా పీడీ అరవల్లి రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో చాట్రాయి మండలం జిల్లాలో వెనుకబడి ఉందని, పనులకు కొరత లేదని, ఎన్ని పనులు మంజూరు చేయటానికైనా సిద్ధంగా ఉన్నామని, కానీ మీ నిర్లక్ష్యం వలన పథకాలు అందక ప్రజలు నష్టపోతున్నారని మండిపడ్డారు. రైతులకు పశుగ్రాస యూనిట్లు, ఉద్యాన పంటలు, పొలం గట్లపై కొబ్బరి, నిమ్మ చెట్ల పెంపకం పథకాలు ఉండగా వీటి గురించి గ్రామాలకు వెళ్లి ప్రజలకు ఎందుకు చెప్పడం లేని ప్రశ్నించారు. పథకాల సమాచారాన్ని సమాచారాన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేయాలన్నారు. మళ్లీ వారంలో తనిఖీకి వస్తానని పరిస్థితి మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినందున పంట కాలువలు పూడిక తీయించాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పీడీని కోరారు. తన సొంత భూమిలో మామిడి మొక్కలు నాటానని, కానీ సిబ్బంది పథకం మంజూరు చేయలేదని కృష్ణారావుపాలెం సర్పంచ్ చిమటబోయన పుల్లారావు పీడీకి తెలపగా, పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంగాకుమారి, ఏపీవో లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ సప్లిమెంటరీలో విద్యార్థుల ప్రతిభ



బి.రోహిత్‌కృష్ణ | కె.శ్రీవల్లి | బి.దుర్గనాగసాయి

కైకలూరు, జూన్ 27: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శాంతిజ్యోతి తెలిపారు. ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో బి.దుర్గానాగసాయి 470 మార్కులరు 452 మార్కులు సాధించి కళాశాల మొదటి స్థానంలో నిలిచారు. బి.రోహిత్‌కృష్ణ 425 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. బైపీసీ గ్రూపులో కె.శ్రీవల్లి 440 మార్కులకు 400 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా బి.సంజయకుమారి 399 మార్కులతో రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. ఒకేషనల్‌లో ఓఏ గ్రూపులో జి.శ్రావణి 500 మార్కులకు 458 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో 90 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నూతన విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు అవగాహనతో వారి పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చదివించాలని కోరారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వం అన్నిరకాల మౌలిక వసతులను కల్పిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూరు శాతం ఉత్తీర్ణత



విద్యార్థినికి స్వీట్ తినిపిస్తున్న హెచ్ఎం శారద

ఆగిరిపల్లి, జూన్ 27: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈదరనందు బాలికల కళాశాల విద్యార్థినులు ఇంటర్ అడ్వాన్స్ సప్లి మెంటరీ పరీక్షలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో వీరమల్ల సంజన 440కి గాను 425 మార్కులు సాధించి కళాశాల ప్రథమంగా నిలవగా రెండో సంవత్సరం విద్యార్థినులు మాగంటి జస్మిత ఎంపీసీ 1000కి 878, పి.లక్ష్మి, 825 మార్కులు సాధించారు. విద్యార్థినులను, హెచ్ఎం సందిపాము శారద, సర్పంచ్ అనిత ఏసుపాదం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అంజయ్య, ఉపాధ్యాయులను అభినందించి ప్రోత్సాహకాలు అందజేశారు.

రెండు కుటుంబాల్లో చీకట్లు

- విద్యుదాఘాతానికి తల్లి కుమారుడు, భార్యభర్తల దుర్మరణం
- వేర్వేరు చోట్ల దుర్ఘటనలు

కరెంట్ షాక్‌కు నాలుగు నిండు ప్రాణాలు బలైపోయాయి. తీగపై బట్టలు ఆరవేసేందుకు వెళ్లిన తల్లి, ఆమెను కాపాడేందుకు వెళ్లిన కుమారుడు మృత్యువాత పడ్డారు... బోరు మోటారు వేసేందుకు వెళ్లిన భార్య కరెంట్ షాక్‌కు గురి కావడంతో కాపాడేందుకు వచ్చిన భర్త కూడా దుర్మరణం చెందాడు. వేర్వేరు ప్రాంతాలలో జరిగిన ఈ దుర్ఘటనలతో విషాదఛాయలు అలముకునాయి. మరణించిన ఈ నలుగురు పేద కుటుంబాలకు చెందిన వారే.

ఈదరలో తల్లీకుమారుడి మృతి



మరణించిన తల్లి, కుమారుడు

ఆగిరిపల్లి, జూన్ 27: బట్టలు ఆరవేసుకునే తీగకు విద్యుత్ ప్రవహించడంతో దానిని తాకిన దొండపాటి నాగరత్నం (60), ఆమె కుమారుడు రామదాసు (40) మృతి చెందిన ఘటన ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వణుకూరి ముత్యాలమ్మ ఇంటి ఎదురుగా నివాసముంటున్న దొండపాటి చంటి ఇంటి నుంచి కరెంటును వాడుకుంటున్నారు. ఇందుకు ఉపయోగించిన వైరును నాగరత్నం బట్టలు ఆరవేసేందుకు ఏర్పాటు చేసుకున్న ఇనప స్తంభానికి చుట్టారు. అయితే ఆ స్తంభం ద్వారా బట్టలు ఆరవేసే తీగకు కరెంట్ ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో నాగరత్నం బట్టలు ఆరవేసేందుకు ఆ తీగను పటుకోవడంతో విద్యుదాఘాతానికి గురై బిగ్గర అరుస్తూ కుప్ప కూలిపోయి మరణించింది. తల్లిని కాపాడేందుకు వచ్చిన కుమారుడు రామదాసు కూడా తీగను పటుకోవడంతో మృతి చెందాడు. నాగరత్నంకు భర్త, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు పక్షవాతంతో బాధపడుతుండగా వారిలో రామదాసు మృతి చెందాడు. నాలుగు నెలల క్రితం ఈ ప్రాంతానికే చెందిన వ్యక్తి కొబ్బరి చెట్టు మీద షాక్‌కు గురై ప్రాణాలు విడిచిన సంగతి తెలిసిందే.

తాడేపల్లిగూడెంలో భార్యభర్తల దుర్మరణం



విగతజీవులుగా పడిఉన్న భార్యభర్తలు వెంకన్న, అన్నపూర్ణ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: అప్పటి వరకూ ఎంతో ఆనందంగా కరికి ఒకరు తోడుగా ఉంటూ సొంత ఇంటి నిర్మాణ పనులు చేసి వెళ్లిన ఆ దంపతులను విద్యుత్ తీగలు బలితీసుకున్నాయి. చల్లటి వాతవరణంలో ఆహ్లాదకరంగా ఉన్న ఆ ప్రాంతం ఆ భార్యభర్తల చావు వార్తతో అంతా విషాదం అలముకుంది. విద్యుత్తు షాకు తగిలిన భార్యను కాపాడటానికి వెళ్లిన భర్త కూడా విగత జీవిగా పడి మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెం పట్టణంలోని గాంధి బొమ్మ సెంటర్ వద్ద చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం గాంధి బొమ్మ సెంటర్ వద్ద నివాసముంటున్న గట్టిం వెంకన్న(60) ఇంటి నిర్మాణ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. గురువారం ఉదయం భార్య అన్నపూర్ణ (55)తో కలిసి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం చేసేందుకు వెళ్లి పనులు పూర్తి చేయించుకుని ఇంటికి వచ్చారు. అయితే మంచినీటి కోసం మోటర్ ఆన్ చేసేందుకు వెళ్లిన అన్నపూర్ణకు విద్యుత్తు వైర్లు లీకై షాక్ తగిలి కేకలు వేయగా కాపాడేందుకు వచ్చిన భర్త వెంకన్న కూడా షాక్ తగిలి అక్కడికక్కడే విగతజీవిగా పడిపోయాడు. స్థానికులు గమనించే సరికే ఇద్దరూ మృతి చెందారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలం వద్ద మృతులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వర్షాలకు విద్యుత్తు వైర్ల విషయంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని విద్యుత్తు అధికారులను ఆదేశించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

స్థలం వివాదంలో రాజీ విఫలం

ముదినేపల్లి, జూన్ 27 : బొమ్మినంపాడులో కాలినడక దారి విషయమై ఇరువురు వ్యక్తుల మధ్య ఏర్పడిన వివాదాన్ని పెద్ద మనసులు పరిష్కరించకపోవటంతో ఆ గ్రామానికి చెందిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన హెడ్ కానిస్టేబుల్ విజయ కుమార్ కథనం ప్రకారం ఈ నెల 4న ఆ గ్రామంలో బోడావుల కేశవర్థిని, గోరింకల దేవేంద్రుడు మధ్య రహదారి హక్కు విషయంలో ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసింది. తగాదా పెద్దది కాగా దేవేంద్రుడు కర్రతో కేశవర్థిని తలపై కొట్టగా, ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో పెద్ద మనుషులకు ఆమె జరిగిన సంఘటన చెప్పగా, రాజీ ప్రయత్నాలు చేశారు. కానీ ఫలించ లేదు. దీంతో 23 రోజుల అనంతరం తనకు న్యాయం చేయాలని కోరుతూ కేశవర్థిని గురువారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు.

రేపు లోక్ అదాలత్

నూజివీడు, జూన్ 27: రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ సూచించారు. నూజివీడు కోర్టు హాల్ ప్రాంగణంలో శనివారం ఉదయం 10.30ని నుంచి లోక్‌అదాలత్ జరుగుతుందని, పరిష్కరించదగిన సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మనోవర్తి తదితర కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు.

జూలై 5 వరకు షిర్డిసాయి సప్తాహం

ఆగిరిపల్లి, జూన్ 27: సింగన్నగూడెం బస్‌స్టాప్ వద్ద గల షిర్డి సాయి మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకోని శుక్రవారం నుంచి జూలై ఐదో తేదీ వరకు 24 గంటలు సాయినామ సప్తాహం జరుగుతుందని ఆలయ ప్రధానార్చకుడు దేవులపల్లి మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమం నూజివీడు అడవి అంజనేయస్వామి ఆలయ ప్రధానార్చకుడు భాగవతుల సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపారు.

రేపు హుండీల ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి, జూన్ 27 : మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవ స్థానంలో శనివారం హుండీల లెక్కింపు జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి నేల సంధ్య తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు భక్తుల నుంచి వచ్చిన కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు.

డయేరియాతో జర భద్రం



సిబ్బందితో మాట్లాడుతున్న జాహ్నవి

కలిదిండి, జూన్ 27 :డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి అన్నారు. కలిదిండి పీహెచ్‌సీలో గురువారం మండల ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా వ్యాపించే అవకాశం ఉందని, రక్షిత తాగు నీరుపై అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ మల విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణంలో నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా వాష్ చేసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు కాయిల్స్ వాడాలన్నారు. హెల్త్ ఆఫీసర్ కృష్ణ కిషోర్, ఎస్.శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు శ్రీదేవి, కళ్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

చాట్రాయి, జూన్ 27: మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు చాట్రాయిలో గురువారం జిల్లా టీడీపీ అధికార ప్రతినిది మందపాటి బసవారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు ప్రారంభం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సారథి అధికారులను ఆదేశించారు. జనార్దనవరం వెళ్లే రహదారి పక్కన ఊర చెరువు కట్టపై ఉన్న చెత్త కుప్పలను తొలిగించి, గ్రామంలో వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, నిషాక్ అలీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పుస్తకాల భారంతో ఆపసోపాలు



ముదినేపల్లి, జూన్ 27 : పాఠశాలలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నా విద్యార్థులకు పుస్తకాల భారం తప్పడం లేదు. అది కూడా మోయలేనంతగా ఉంది. ఒక తరగతి నుంచి మరో తరగతికి ప్రమోట్ అయ్యే కొద్ది పుస్తకాల భారం కూడా పెరుగుతుంది. పాఠ్యపుస్తకాలతోపాటు నోట్స్ పుస్తకాలు, వర్క్ బుక్స్ కలిపి పెద్ద సంచి నిండిపోతుంది. ఆ సంచిని చేతులకు తగిలించుకునే అవకాశం లేదు. దీంతో ఇంటి నుంచి పాఠశాలకు భుజాలపై పెట్టుకుని పుస్తకాల సంచులు, బ్యాగ్‌లను పాఠశాలకు విద్యార్థులు తెచ్చు కుంటున్నారు. గురువారం ముదినేపల్లిలో 8వ తరగతి విద్యార్థి పుస్తకాల సంచిని రెండు భుజాలపై మార్చుకుం టూ, మోయలేని చోట కిందకు దింపుకుంటూ ఆపసోపా లు పడుతూ జడ్పీ హైస్కూలుకు రావడం కనిపించింది.

సార్వా సాగు ప్రారంభం



పెదగొన్నూరులో మొదలైన పొలం పనులు

ముదినేపల్లి, జూన్ 26 : ముదినేపల్లి మండలంలో సార్వా సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఎక్కువ శాతం రైతులు వెదజల్లే విధానంలో వరి సాగు చేపట్టారు. మండలంలో సుమారు 17,500 ఎకరాల ఆయకట్టులో క్యాంప్ బెల్, పోల్‌రాజ్, బంటుమిల్లి, గుడివాడ కెనాల్స్ పరిధిలో సార్వా సాగు చేస్తుండగా, 11 వేల ఎకరాల్లో వెదజల్లే విధానంలో వరి సాగు నిర్వహించనున్నారు. ఈ సీజన్‌లో అత్యధిక శాతం రైతులు 1318, 1061 రకం వరి విత్తనాలను వినియోగిస్తుండగా, కొన్ని గ్రామాల్లో రైతులు స్వర్ణ రకం వరి విత్తనాలపై మోజు చూపిస్తున్నారు. మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. తరచూ వర్షాలు కురుస్తున్నందున గరువు భూముల్లో వెదజల్లే పనులు నిర్వహిస్తున్నారు. నారుమళ్లను కూడా సిద్ధం చేస్తున్నారు. జూలై నెలాఖరుకు నాట్లు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.